క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి

బల్మూర్: మండలంలోని రామాజిపల్లి శివాలయం వద్ద ఉన్న రామలింగేశ్వర సమేత అంతటమ్మ దేవత గుడి పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆలయ పై కప్పు పనులను శివస్వాముల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన భక్తులు సోమవారం పూర్తి చేశారు. అనంతరం శివాలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బండపల్లి స్వామి, ఆంజనేయులు, బాబు, పర్వతాలు, రమేష్, శ్రీశైలం, తిరుపతి, కృష్ణ, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏబీవీపీ విద్యార్థి నాయకులు పోస్టర్ విడుదల చేశారు. ఈ నెల 23, 24వ తేదీలలో సిద్దిపేటలో నిర్వహించనున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ కన్వీనర్ వెంకటేష్ కోరారు.

అన్ని పాఠశాలల్లో డైట్ మెనూ అమలు చేయాలి

కందనూలు: రాష్ట్రంలో ఉన్న రెసిడెన్షియల్ నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలో డైట్ చార్జీల మెనూను అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సంఘం మురళి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికి తారతమ్యం లేకుండా అందరికి ఒకే మెనూ అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సాంఘిక సంక్షేమం, మైనారిటీ మెడల్, కేజీబీవీ తదితర హాస్టల్లో ఒకేలా వీటికి భిన్నంగా నాన్ రెసిడెన్సియల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో వేర్వేరుగా అమలు చేస్తే విద్యార్థుల మధ్య తారతమ్యాలు ఏర్పడుతాయని, విద్యాప్రమాణాలమీద ప్రభావం చూపుతాయన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు సంఘం మురళి, కొత్త శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి అంజనయ్య కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని టీఎస్‌యూటీఎస్ భవనంలో జాతీయ పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నట్లు పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్ట్

వెల్దండ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు పోలీసులు ఆ సంఘం నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో పీడీఎస్‌యు రాష్ట్ర నాయకులు సంతోష్, తదితరులు ఉన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావన హర్షనీయం

మన్ననూర్: నల్లమలలోని మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించడం, టూరిజం హబ్‌గా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పూర్తి స్థాయిలో సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అసెంబ్లీలో ప్రస్తావించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో ఈ ప్రాంతాన్ని మంత్రి సీతక్క ఆదివాసీల సమస్యలు, ఇబ్బందులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన విషయాన్ని మంత్రి గుర్తు చేస్తూ ఎమ్మెల్యే అడిగిన అభివృద్ధి పనులను ఒప్పుకోవడంతో పాటూ అన్ని ప్రాంతాలతో పాటు ప్రశాంతినగర్ (మన్ననూర్) గ్రామానికి కూడా రోడ్లు వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆశబుస్సులతో ప్రజా పాలనలో తక్షణమే నిధులు కూడా మంజూరు చేయిస్తానని ఒప్పుకోవడం ఎంతో సంతోషకరమని వివరించారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, సంబు శోభ, మాజీ ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, బాలమ్మ, నాయకులు బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, మేరాజ్, రాజారాం, శంకరయ్య, గోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

నీటి ఎద్దడితో అవస్థలు

దోమలపెంట: గత రెండు వారాలుగా గ్రామంలో నీటి ఎద్దడితో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సమస్య పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. దీంతో సోమవారం గ్రామంలో ప్రతి ఇంటికి ట్రాక్టర్ ద్వారా రెండు డ్రమ్ముల నీటిని సరఫరా చేశారు. తాగునీటి సమస్య రాకుండా శాశ్వతంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. నీటి సరఫరాకు కృషి చేసిన ఎమ్మెల్యేకు నాయకులు మోయిజ్, బి.మల్లికార్జున, కుమార్, కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాసం పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం గోదాదేవికి పూజలు చేసి మొక్కలు చెల్లించారు. ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ మాట్లాడుతూ ధనుర్మాసంలో నెల రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం

కొల్లాపూర్: పట్టణంలోని రామమందిరం, బండాయిగుట్ట వేంకటేశ్వరాలయం, మాధవస్వామి దేవాలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో నెల రోజుల పాటు నిర్వహించే ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. తిరుప్పావై, ప్రబంధ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు అర్చకులు రామాచారీ తెలిపారు.




కల్వకుర్తిలో వేంకటేశ్వరస్వామి,కొల్లాపూర్‌లో రామమందిరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా ఇరుముడి

లింగాల: మండల కేంద్రంలోని అభినవ వీరమణికంఠ అయ్యప్ప ఆలయంలో సోమవారం స్వాముల ఇరుముడి నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది. 41 రోజుల పాటు దీక్ష పూర్తి చేసిన స్వాములకు గురుస్వాములు భగవాన్, రాంచంద్రయ్య, రామ్మోహన్‌రావు, శ్రీనివాసులు ఇరుముడిని కట్టారు. నూకల రాజమణెమ్మ ఫౌండేషన్ చైర్మన్ నూకల శంకర్‌బాబు దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఇరుముడి ఎత్తుకున్న స్వాములు ప్రత్యేక వాహనాలలో శబరిమల యాత్రకు తరలివెళ్లారు.

అయ్యప్ప మాలధారుల ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేసి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



లింగాలలో ఇరుముడి కడుతున్న గురుస్వాములు

నాణ్యమైన ఆహారం వడ్డించాలి



పాఠాలు బోధిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

పెద్దకొత్తపల్లి: విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. వంటగదిలో నిల్వ ఉన్న సరుకులను, రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. నాణ్యతలేని కూరగాయాలతో వంటలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురి అయితే మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం దుప్పట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, ఏఎస్ఓ లత ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. కొందరికే రూ.2లక్షల రుణమాఫీ అయ్యిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, నిరంజన్ యాదగిరి, అశోక్, లింగంముదిరాజ్, శంకర్‌నాయక్, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కల్వకుర్తిరూరల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేసి కృష్ణయ్యకు నివాళులర్పించాడు. మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, మధు, మనోహర్‌రెడ్డి, పుల్లారెడ్డి, బాలయ్య, తలసాని కృష్ణారెడ్డి, మల్లేష్, శ్రీశైలం, బాలయ్య తదితరులు ఉన్నారు.

వేతనాలు పెంచే వరకు పోరాటం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచేవరకు పోరాడుతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 20 వేల మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని ఎక్కువ సంఖ్యలో దళిత, మైనార్టీ వారే అధికంగా ఉన్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 500 మంది జనాభాకు ఒక కార్మికుడి చొప్పున ఉండాలని కాని ప్రభుత్వం ఆ నిబంధనలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు మల్లేష్, రాములు, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొదిల రామయ్య

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



బల్మూర్‌లో రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బల్మూర్: వరి కొనుగోలు కేంద్రాల్లో వివిధ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాగయ్య, సుధాకర్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన వరి ధాన్యాన్ని తిరిగి ప్యాడి క్లీనింగ్ చేస్తేనే కొనుగోలు చేస్తామని, 17 తేమ శాతం ఉన్న వడ్లను తూకం చేయాల్సి ఉన్న 14 శాతం ఉంటేనే తూకం చేస్తామని ఆంక్షలు విధిస్తుండటంతో రైతులు 20 రోజుల నుంచి నిరీక్షిస్తున్నారని వారు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి నెల రోజులు దాటుతున్నా కూడా ఇప్పటి వరకు ఒక్క లారీ లోడ్ కూడా ఇక్కడి నుంచి మిల్లులకు వెళ్లలేదని, ఐకేపీ వారు స్వంత నిర్ణయాలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆంక్షలతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. వెంటనే ప్యాడీ క్లీనర్‌ను ఎత్తి వేసి రైతుల ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, రాములు, రఫీ, రైతులు పాల్గొన్నారు.

ప్రతిఘటన ఉద్యమాలకు దళితులు సన్నద్ధం కావాలి

నాగర్‌కర్నూల్‌రూరల్/తాడూరు: దళితులపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు ప్రతి ఘటన ఉద్యమాలకు సన్నద్ధం కావాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు తాడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేర్వేరుగా ఆయన మాట్లాడారు. 21వ శతాబ్దంలోను కుల వివక్షత, అంటరానితనం కొనసాగడం సిగ్గుచేటన్నారు. సైన్స్ టెక్నాలజీ సాంకేతిక రంగాలలో దేశం పురోగతి చెందుతున్నా ఇప్పటికి దళితులను దేవాలయాల ప్రవేశం లేకపోవడం దారుణమన్నారు. పోలీసు యంత్రాంగం, రెవెన్యూ యంత్రాంగం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సు ప్రకారం ప్రతి మంగళవారం అస్పృశ్యత నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కృష్ణ, నాగరాజు, రామచంద్రయ్య, బహుగుణ, జంగయ్య, పరమేశ్వర్, తాడూరులో నాయకులు శివుడు, కృష్ణయ్య, నరసింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. శాంతియుత నిరవధిక సమ్మెకు అన్ని ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కపిలవాయి గోపి, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రైస్ మిల్లు ప్రారంభం



పెంట్లవెల్లిలో రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో రైస్ మిల్లును సోమవారం మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశమై పార్టీ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన వెంకటస్వామిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, రాజేష్, సురేందర్‌గౌడ్, పోతుల వెంకటేశ్వర్లు, యాగొస్, రాము, శేఖర్, రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

కల్వకుర్తిరూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి చికిత్స శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రారంభించాడు. కంటి వైద్యుడు చంద్రశేఖర్ 45 మందికి కంటి పరీక్షలు చేశారు. 15 మందిని ఆపరేషన్ కోసం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేష్, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, చంద్రశేఖర్, క్లబ్ పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని వెన్నెల సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కలెక్టర్ బడావత్ సంతోష్‌కు సాహితీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్, తెలంగాణ సాహితీ అధ్యక్షులు వహీద్ ఖాన్, దళిత సమైఖ్య అధ్యక్షుడు ఎదిరెపల్లి కాశన్న తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: డీపీసీ రేట్ల ప్రకారం పాత మెనూ స్థానంలో కొత్త కామన్ డైట్ మెనూ తయారుకు చర్యలు తీసుకోవాలని కోరతూ సోమవారం తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీరాం సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సమస్యలు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు



సీఎల్‌ఆర్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

తెలకపల్లి: మండల కేంద్రంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. కేకేరెడ్డి ఉన్నత పాఠశాల, శాంతినికేతన్ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాల, మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో, బాలికల గురుకుల పాఠశాలలో ఆరు కేంద్రాలలో ఆదివారం ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు ప్రకాశ్ రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి వెంకటరాములు, అబ్జర్వర్ తిరుపతిరెడ్డి, అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్‌ఐ నరేష్, పోలీసు సిబ్బంది తెలిపారు.

దళిత నాయకుల అరెస్టు



తెలకపల్లిలో అరెస్టు అయిన నాయకులు

కొల్లాపూర్: దళితబంధు నిధులు విడుదల కోసం అసెంబ్లీ ముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా సోమవారం పట్టణంలో బీఆర్‌ఎస్ దళిత నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై వదిలిపెట్టారు.

తెలకపల్లి: అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రెడ్డపాకుల రమేష్, గుంపల్లి పర్వతాలు, భాషమోని సత్యనారాయణను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంతపూచీకతపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

కోడేరు: బీఆర్‌ఎస్ దళిత నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు బొట్టు వెంకటస్వామి, కృష్ణయ్య, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆశావర్కర్లు

కొల్లాపూర్: ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు వేతనాల పెంపు కోసం ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జాతా ప్రారంభమైందని, 24 వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి జాతా చేరుకుంటుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా దాదాపుగా 10 లక్షల మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారని, వారికి సమానపనికి సమాన వేతనం చెల్లించాలని ఆయన కోరారు. ఆశావర్కర్ల డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కళావతి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, నాయకురాళ్లు శివలీల, చెన్నమ్మ, వకులాదేవి, వెంకటమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.


ఆర్. కృష్ణయ్యకు సీటు ఇవ్వడంపై హర్షం



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఆర్ కృష్ణయ్యకు ఎన్డీఏ కూటమి రాజ్యసభ నామినేటర్ పదవికి నియమించడం బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మల్లేష్‌గౌడ్‌తోపాటు కాళ్ల నిరంజన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, మౌలానా, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

చట్టాలను విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటేష్, మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నక్షబాట ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వెల్దండ: మండలంలోని చొక్కన్నపల్లిలో వ్యవసాయ పొలాలకు వెళ్లే నక్షబాటను గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఆక్రమిస్తున్నట్లు సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులకు సమస్యను వివరించారు. ఆరు నెలలుగా నక్షబాటను ఆక్రమించడంతో రైతులు పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బాట ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. శేఖర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, శశిధర్‌రెడ్డి, పెద్దయ్య, వెంకటయ్య ఉన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న శానిటేషన్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగైదు సంవత్సరాలుగా కార్మికులకు వేతనాలు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అంతటి కాశన్న, శానిటేషన్ కార్మికులు రేణుక, రేవతి, మైబమ్మ, లక్ష్మమ్మ, సర్దార్, భారతి, శ్రీవాణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలి



లింగాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

లింగాల: కొత్త మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ బషీర్ అహ్మద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని, శాయిన్‌పేట, దత్తారం పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన పరిశుభ్రతతో కూడిన వంటకాలను చేయాలని సూచించారు. అపార్ ఐడీ కోసం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారి సమ్మతి తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు.

పునరావాసానికి సబ్ డివిజన్ కమిటీ ఏర్పాటు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలోని వటువర్లపల్లి గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించేందుకు అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఆర్డీఓ మాధవి సమక్షంలో సోమవారం సబ్ డివిజనల్ కమిటీ (ఎస్‌డీఎల్‌సీ) ఏర్పాటు చేసినట్లు గ్రామ పునరావాస కమిటీ అధ్యక్షుడు సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్న 663 కుటుంబాలలో ఎంత మంది అర్హులు అన్న విషయాలను గ్రామ పునరావాస కమిటీ, సంబంధిత అధికారులతో కలిసి ఎస్‌డీఎల్‌సీ కమిటీ క్షేత్ర స్థాయిలో విచారణ చేయడంతో పాటు గ్రామసభ తీర్మానం చేయడం జరుగుతుందని కమిటీ నిర్ణయించింది. పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ ఇచ్చే పునరావాస ప్యాకేజీకి అర్హులు కావాలంటే 2014 సమగ్ర సర్వే లిస్టును పరిగణలోకి తీసుకోవడంతో పాటు గత రెండు అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికలలో అదే గ్రామం నుంచి ఓటు హక్కు కలిగి ఉండాలని వివరించారు. అటవీశాఖ తీసుకువచ్చిన కఠినమైన నూతన చట్టాలతో అభయారణ్యం పరిసర ప్రాంతంలో మనుగడ సాగించలేకపోతున్నామని జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఆర్డీఓ, అటవీశాఖ అధికారులకు విన్నవించుకున్నారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు సాయిబాబు సమక్షంలో ఆర్డీఓను సన్మానించారు.ఎఫ్‌డీఓ రామ్మూర్తి, ఎఫ్‌ఆర్‌ఓ గురుప్రసాద్, ధర్మనాయక్, బాపిరెడ్డి, గ్రామ పునరావాసం కమిటీ అధ్యక్షుడు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.